## పెండింగ్ బిల్లులు చెల్లించండి

గంగాధరలో మాజీ సర్పంచుల నిరసన



గంగాధర మండల పరిషత్ ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

గంగాధర, డిసెంబర్ 6 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచుల జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన చెందారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పోలీసులు అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. పెండింగ్ బిల్లుల కోసం ఈ నెల 9 నుంచి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే రిలే నిరాహార దీక్షలకు మాజీ సర్పంచులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ మాజీ సర్పంచులు మడ్లపెల్లి గంగాధర్, మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, రేండ్ల శ్రీనివాస్, ఎండీ నజీర్, వడ్లూరి ఆదిమల్లు, రాసూరి మల్లేశం, రామిడి సురేందర్, బోల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, ఆముదాల రమణారెడ్డి, కొంకటి శంకర్, పొట్టల కనకయ్య ఉన్నారు.

## తుపుక్.. తుపుక్!



నిత్యం వందలాది మంది రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడే కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన పారిశుధ్య నిర్వహణ సరిగా లేక అధ్వానంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దవాఖానను అభివృద్ధి చేయడంతోపాటు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది, అధునాతన వసతులు కల్పించడంతో క్రమంగా రోగుల సంఖ్య పెరిగింది. అయితే, ప్రస్తుతం నిర్వహణ గాడి తప్పడంతో గోడలపైన, దవాఖాన ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ 'తుపుక్.. తుపుక్'మంటూ ఉమ్మిన దృశ్యాలే కనిపిస్తున్నాయి.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంగనర్



కరీంనగర్ బస్టాండ్ ఎదుట కేడీసీసీబీ అడ్డా వద్ద ఖాళీగా ఉన్న ఆటోలు



రామగుండం ఎన్టీపీసీ జంగాలపల్లి వద్ద ప్రారంభానికి సిద్ధమైన డబుల్ బెడ్రూం ఇండ్లు

## నెరవేరుతున్న డబుల్ కల

- కేసీఆర్ ప్రభుత్వంలో 634 ప్లాట్ల నిర్మాణం
- నేడు ఎన్టీపీసీలో లబ్ధిదారులకు కేటాయింపు

కోల్‌సిటీ, డిసెంబర్ 6 : నిరుపేదల కోసం డబుల్ బెడ్రూం ఇండ్ల కల నెరవేరబోతున్నది. అతి త్వరలోనే గృహ ప్రవేశాలకు అంతా సిద్ధమైంది. ఇల్లు లేని పేదల కోసం గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రామగుండం ఎన్టీపీసీ జంగాలపల్లి సమీపంలో దాదాపు 634 ప్లాట్లతో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాన్ని నిర్మించింది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పనుల్లో కాస్త జాప్యం జరిగింది. ప్రస్తుతం ఆ సముదాయం పూర్తికాగా, ఇటీవల కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ జెల్ల అరుణశ్రీ పరిశీలించారు. డబుల్ బెడ్రూం ఇండ్లు లబ్ధిదారులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అర్హులను డ్రా పద్ధతిలో ఎంపిక చేయగా, రామగుండం రెవెన్యూ అధికారులు గృహ ప్రవేశాలకు అంతా సిద్ధం చేశారు. శనివారం ఎన్టీపీసీ మల్యాపూర్ రోడ్డులోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో డ్రా పద్ధతిలో లబ్ధిదారులకు ప్లాట్ల నంబర్లు కేటాయించనున్నారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పుణ్యమాని డబుల్ బెడ్రూం ఇండ్లలో అడుగు పెట్టబోతున్నామంటూ సంబురపడుతున్నారు.

# ఆటోడ్రైవర్ల ఆర్తనాదం

నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆటోలు బంద్

- దుర్భరంగా ఆటోవాలాల జీవితాలు
- ఫ్రీ బస్ పథకంతో తగ్గిపోయిన గిరాకీ
- ఉపాధి దెబ్బతిని బతుకులు ఆగం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఆత్మహత్యలు.. హఠాన్మరణాలు
- న్యాయం కోసం రోడ్డెక్కుతున్న ఆటోవాలాలు
- నేడు అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో ర్యాలీలు
- కలెక్టరేట్ల ఎదుట ఆందోళన

**ఏడాది కాలంగా ఆకలి కేకలు**



ఆటో బంద్ పోస్టర్‌ను చూపుతున్న ఆటో డ్రైవర్లు

**కాంగ్రెస్ పాలనలో ఆటోడ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో జీవితాలు రోడ్డు మీద పడుతున్నాయి. ఏడాది కిందటి వరకు ఆటోలు నడుపుకొని నిరందీగా కుటుంబాలను పోషించుకున్నా.. ఇప్పుడు బతుకు భారమైపోయింది. గిరాకీలు లేక నిరుపేద, నిరుద్యోగులకు ఉపాధి దెబ్బతిన్నది. దీంతో ఆకలి కేకలు, ఆర్తనాదాలు వినిపిస్తుండగా, కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటే.. మరికొందరు మనోవేదనకు గురై గుండెపోట్లతో చనిపోతుండడం కలచివేస్తున్నది. కాంగ్రెస్ సర్కారు తమను ఆదుకుంటామని హామీ ఇచ్చి మరిచిపోయిందని, తమ బతుకులు ఆగమైనా పట్టించుకోవడం లేదని ఆటోడ్రైవర్లు మండిపడుతున్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆటోలను బంద్ చేపట్టడంతోపాటు ముఖ్యపట్టణాల్లో ర్యాలీలు తీసి కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు.**

కరీంనగర్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఏడాది కిందటి వరకు ఆటోవాలాల పరిస్థితి బాగానే ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగమైంది. మహాలక్ష్మి పథకంతో బతుకు దుర్భరంగా మారింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలు నడిపించుకొని జీవించే ప్రతి ఒక్కరిపైనా తీవ్ర ప్రభావం పడింది. ఒక్కసారిగా ఆకలి కేకలు మొదలుకాగా, అప్పులు చేసి ఆటోలు కొనుక్కున్న ఎందరో నిరుద్యోగులు కిస్తీలు చెల్లించలేని, అప్పులు కట్టలేని దయనీయ స్థితికి వచ్చారు. ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితుల్లో ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకుల ప్రతినిధులు ఆటోలు లాక్కెళ్లగా, ఎందరో ఆటోడ్రైవర్లు మనస్తాపం చెందారు. ఆత్మహత్యల బాట పట్టి కుటుంబాలను ఒంటరి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 62 మంది ఆత్మహత్యలు, హఠాన్మరణాలకు గురయ్యారు. అందులో ఒక్క కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే వీరి సంఖ్య 13 వరకు ఉందంటే కాంగ్రెస్ తెచ్చిన మహాలక్ష్మి పథకం ఎంతటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు.

### ఏడాదిలో అంతా ఆగం

ఒకప్పుడు ఆటోవాలాలు బస్సు వెళ్లని గ్రామాలకు సైతం వెళ్లేవారు. మూరుమూల రూట్లలోనూ ప్రయాణికులను గమ్యం చేర్చేవారు. అప్పట్లో గిరాకీ బాగుండడం, ఉపాధికి డోకా లేకపోవడంతో ఎందరో నిరుద్యోగులు ఆటోలు సమకూర్చుకొని జీవనం సాగించారు. ఏడాది కిందటి వరకు పరిస్థితి బాగానే ఉన్నా.. గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మహాలక్ష్మీ పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఏడాదిలో అంతా తారుమారైంది. ఆ తర్వాత ఆటోలు ఎక్కేవారే కరువయ్యారు. దాంతో వీటినే నమ్ముకొని బతుకుతున్న డ్రైవర్లు ఆగమయ్యారు. ఒకప్పుడు ఆటోల్లో ఎక్కువగా వెళ్లిన మహిళలు, ఇప్పుడు బస్సుల్లో వెళ్తుండడంతో ఆటోల గిరాకీ దెబ్బతిన్నది. దాంతో కార్మికులకు ఉపాధి కరువైంది. ఏ రూట్లో వెళ్లినా మహిళలు బస్సుల కోసం వేచి చూస్తున్నారే తప్ప తమ ఆటోల్లో ప్రయాణించడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. ఒకప్పుడు రోజుకు రూ.వెయ్యి పదిహేను వందలు సంపాదించినా.. ఇప్పుడు మూడు నాలుగు వందలు కూడా గిట్టుబాటు కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

### కుటుంబాలపై ప్రభావం

గిరాకీ దెబ్బతినడంతో ఆటోవాలాలు ఆగమవుతున్నారు. అప్పులు చేసి ఆటోలు కొన్నవాళ్లు కిస్తీలు, ఈఎంఐలు చెల్లించలేక పోతున్నారు. నాలుగైదు ఈఎంఐలు పెండింగ్ ఉన్న ఆటోలను ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకులు లాక్కెళ్తుండడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రభావం కుటుంబాలపైనా పడుతున్నది. ఆర్థిక ఇబ్బందులు మొదలై అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చింది. ఫీజులు చెల్లించలేక అనేక కుటుంబాల్లో పిల్లల చదువులు ఆగిపోగా, పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించుకునే వాళ్లు ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. అనేక కుటుంబాల్లో ఏ పూటకు ఆ పూట కొనుక్కొని తినాల్సిన పరిస్థితులు వచ్చాయని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అప్పులు చెల్లించలేక, చేతిలో మరో పని లేక అనేక మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మనోవేదనతో గుండెపోటుకు గురవుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 13 మంది మరణాలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో 13 మందికిపైగా ఆటో డ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారు. కొందరు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరు గుండెపోటుతో చనిపోయారు. కరీంనగర్ జిల్లా చామన్‌పల్లికి చెందిన బండపల్లి భూమయ్య (45), ఇదే మండలంలోని దుర్శేడ్‌కు చెందిన పూదరి రమేశ్ గౌడ్ (40), రామడుగు మండలం షానగర్‌కు చెందిన జంగిలి శ్రీనివాస్ (38), వీణవంక మండలం చల్లూరుకు చెందిన ఎదులాపురం వెంకటేశ్వర్లు (43), సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన గూడెపు సతీశ్ (37) గుండె పోటుకు గురై అర్ధాంతరంగా తనువులు చాలించారు. కరీంనగర్‌లో జీవిస్తున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపల్లికి చెందిన బుర్ర కరుణాకర్, కొడిమ్యాల మండలంలో బత్తిని మదన్, రామగుండంలోని భీమయ్యనగర్‌కు చెందిన అంజి (29) (రైల్వేట్రాక్‌పై పడి), కోనరావుపేట మండలం ధర్మారానికి చెందిన సామనపల్లి స్వామి (38), చొప్పదండికి చెందిన గోపాల అనిల్ (30), ముత్తారం మండలానికి చెందిన తగరపు వినోద్ (30), గొల్లపల్లి మండలం ఎన్నమట్లకు చెందిన పొన్నం వెంకటేశ్ (28), మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు (35) ఆత్మహత్య చేసుకున్నారు.

### నేడు ఆందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం తమ భద్రత, సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆటోడ్రైవర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తమకు ఏడాదికి ₹12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందని మండిపడుతున్నారు. గతంలో అనేక సార్లు తాము ఆందోళన చేసినా ప్రభుత్వం లెక్కచేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు సంఘాల ఆధ్వర్యంలో జేఏసీగా ఏర్పడి ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆటోలు బంద్ చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని ముఖ్య పట్టణాల్లో ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తామని చెప్పారు. తెలంగాణ ఆటో డ్రైవర్ల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అనుబంధ బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, టీఏడీఎస్, ఆటో ఓనర్స్ అసోసియేషన్, తదితర సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు.

### ప్రధాన డిమాండ్లు ఇవే

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి ₹15 వేలు చెల్లించాలి
- ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలి
- ప్రమాద బీమా ₹10 లక్షలకు పెంచి, సాధారణ మరణాలకు వర్తింపజేయాలి
- 50 ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలి
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి
- ఆటోలు, క్యాబ్‌లకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి
- రాష్ట్ర ప్రభుత్వ టాక్సీ వాహనాలకు యూనిఫామిక్ ఫెయిర్ నిర్ధారణ చేయాలి
- ఆత్మహత్యలు, గుండెపోటుతో మరణించిన ఆటో డ్రైవర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలి



రవాణా శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్ల సమస్యలపై స్పందించాలి. తక్షణమే ఆటో డ్రైవర్ల యూనియన్లతో చర్చలు జరిపి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. గతంలో ఎంతో సంతోషంగా ఉన్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఇప్పుడు ఆగమైనయి. దీనంతటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. మహాలక్ష్మీ పథకాన్ని సంపన్నులు కూడా వినియోగించుకుంటున్నరు. కానీ, తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకే ఈ సదుపాయం ఇవ్వాలి. ఆటోడ్రైవర్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి భద్రత కల్పించాలి. ఆటో ఇన్స్యూరెన్స్ కట్టాలంటే ₹10 వేలు అవుతున్నయి. తినడానికి తిండే లేని ఆటోకార్మికులు ఇంత పెద్ద మొత్తం ఎలా కడుతరు? ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి. తక్షణమే ₹వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

- బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, టీఏటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### అడుక్కుతినే దుస్థితి వచ్చింది



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆటోడ్రైవర్లు అడుక్కుతినే దుస్థితి వచ్చింది. మార్పు తెస్తాం ఓట్లు వేయాలంటే ఎగబడి వేసినం. మా ఆటోడ్రైవర్ల ఉసురు పోసుకోవడమేనా మార్పు అంటే. రాష్ట్రంల 62 మంది ఆత్మహత్యలు చేసుకున్నరు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలె. మహాలక్ష్మీ పథకం ప్రభుత్వోద్యోగులు, సంపన్న మహిళలకే ఉపయోగపడుతున్నది. పేద, మధ్య తరగతి వాళ్లు ఎప్పుడో ఒకసారి బస్సుల్లో ప్రయాణం చేస్తున్నరు. ఈ పథకం మీద పునఃసమీక్ష చేయాలి.

- పడాల రాజమౌళి, ఆటో 2 అడ్డా కార్యదర్శి (కరీంనగర్)

### ఫ్రీ బస్సుతోనే ఆగమైనం



ఒకప్పుడు ఆటోలు సరిపోయేటివి కాదు. చానామంది ఆటోలనే వెళ్లెటోళ్లు. బస్సు కన్నా రూపాయి రెండ్రుపాయలు తక్కువ తీసుకునెటోళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక మా బతుకులు ఆగమైనయి. ఫ్రీ బస్సు పథకం ఎప్పుడైతే వచ్చిందో అప్పటిసంది మా ఆటోల మొఖం కూడా చూస్త లేరు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకు ఆధారం లేకుండ జేసింది. ఫ్రీ బస్సు పెట్టినా మాకు ఏదన్నా ఆధారం చూపాలె. ఏడాదికి ₹12 వేలు ఇస్తమని చెప్పిన్రు. ఏడాది దగ్గరపడనే వట్టె. ఒక్కసారన్న మాట్లాడిన్రా? అందుకే ఆందోళన చేస్తున్నం.

- గంప కృష్ణయ్య, ఆటో డ్రైవర్ (కరీంనగర్)

### మా బతుకులు రోడ్ల మీద పడ్డయ్



రేవంత్‌రెడ్డి సీఎం అయినంక మా బతుకులు రోడ్ల మీద పడ్డయ్. మమ్ములను చెత్త బుట్టలకన్నా హీనంగ చూస్తున్నరు. ఆటోలు మంచిగ నడుస్తున్నయికదాని నేను ఫైనాన్స్‌ల కొనుక్కున్న. నెలకు ₹9 వేలు కట్టాలె. ఇప్పటికీ ఐదు నెల్లయితంది ఈఎంఐ కట్టక. రేపో మాపో ఆటో లాక్కపోతరు. నేను బజార్ల పడక తప్పది. ఇంత పురుగుల మందు తెచ్చుకుని తాగి చస్తం. ఇంతకన్న మాకు ఇంకేమున్నది? ఈ వయసుల ఇంకో పని చేసుకునే పరిస్థితి లేదు. మాకు న్యాయం చేయకుంటే ఆందోళన చేయకతప్పదు. మా బతుకులు మారాలంటే ప్రభుత్వం చేతులనే ఉన్నది.

- వడ్లకొండ రాజయ్య, ఆటో డ్రైవర్ (పొరండ్ల)

### రోజుకు మూడు వందలస్తలేవు



ఏడాది కింద రోజుకు వెయ్యి పదిహేను వందలు సంపాయించుకునెటోళ్లం. ఇప్పుడు మూడు వందలు కూడా వస్తలేవు. ఫ్రీ బస్సు వచ్చి మా బతుకులను ఆగం చేసింది. పథకం పెట్టినప్పుడు మా గురించి ఆలోచించితే బాగుండేది. మేమిప్పుడు రోడ్డు మీద పడితే ప్రభుత్వానికి తలవంపు కాదా? మా పరిస్థితిని ఎందుకు అర్థం చేసుకుంట లేరు. మా పిల్లలను సాదుకునుడు కష్టమైతంది. ఇంకొన్ని రోజులు ఇట్ల నే ఉంటే సిరిసిల్లల చేనేత కార్మికుల లెక్క మేము కూడా ఆత్మహత్యలు చేసుకొని సచ్చుడే అయితది.

- బొజ్జ స్వామి, ఆటో డ్రైవర్ (పొరండ్ల)

## కేసులకు భయపడేది లేదు

- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



బీఆర్ఎస్వీ నాయకులతో కోరుకంటి చందర్

సుల్తానాబాద్, డిసెంబర్ 6 : ఉద్యమాలు తమకు అలవాటేనని, కేసులకు ఏమాత్రం భయపడేది లేదని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని, వారి సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే పోలీసులు కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సుల్తానాబాద్‌లోని గురుకుల పాఠశాలలను విద్యార్థి నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతున్న సమయంలో పోలీసులు వచ్చి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి ఆందోళనలు చేయకున్నా తమను అరెస్ట్ చేయడం హాస్యాస్పదంగా ఉందని విద్యార్థి నాయకులు విమర్శించారు. తమ వద్ద ఉన్న ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, డాటాను డిలీట్ చేశారని ఆరోపించారు. అరెస్ట్ విషయం తెలుసుకున్న కోరుకంటి చందర్ సుల్తానాబాద్‌కు చేరుకుని విద్యార్థి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని మండిపడ్డారు. గురుకులాల్లో సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ ఉన్నారు. గురుకుల బడిబాట జిల్లా ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు రాజోజుల శివ, నాయిని అన్వేశ్, అయితు సాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన వడ్లు

## ధాన్యం నీళ్లపాలు

- అకాలం వర్షంతో తడిసిన వడ్లు

పెద్దపల్లి, డిసెంబర్ 6: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి అకాల వర్షంతో ధాన్యమంతా నీళ్లపాలైంది. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన వడ్లన్నీ తడిసిపోయాయి. టార్పాలిన్లు కప్పినప్పటికీ కుప్పల్లోకి నీళ్లు చేరాయి. మాయిశ్చర్ రాని కారణంగా తూకం వేయడంలో ఆసల్యం కావడం వల్ల అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబోయాల్సి వచ్చింది. ఆర్నెళ్లు అరిగోస పడి పండిస్తే అకాల వర్షం ఆగం చేసిందని రైతులు వాపోయారు. తడిసిన వడ్లను ప్రభుత్వం కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



తడిసిన వడ్లను ఆరబోస్తున్న మహిళా రైతు

### పెట్టుబడి కూడా వచ్చేటట్టు లేదు

రెండెకరాల్లో సన్నవడ్లు పండించిన. రెండు ట్రాక్టర్ లోడ్లు అయినయ్. నాలుగు రోజుల కింద మార్కెట్‌కు తెచ్చిన. పగటీలు ఆరబెట్టి.. రాత్రికి కుప్ప చేసేది. రేపో మాపో కాంటా పెడుతారనుకున్న. నిన్న మబ్బు లేదని కుప్ప చేయలేదు. చెడగొట్టు వాన నడిజాం రాత్రి కొట్టింది. తెల్లారి వచ్చి చూచే సరికి వడ్లన్నీ తడిసినయ్. ఆరుగాలం కష్టపడి పండించిన పంటంతా తడిసిపోయింది. పోయినేడు దొడ్డు వడ్లు వేస్తే 3 ట్రాక్టర్ల లోడ్ల వడ్లు పండినయ్. బోనస్‌కు ఆశపడి సన్న వడ్లు పండిస్తే రెండు ట్రాక్టర్ లోడ్ల వడ్లు వచ్చినయ్. అవి కూడా తడిసి పోయినయ్. పెట్టుబడి కూడా వచ్చేటట్టు కనిపిస్తలేదు. తడిసిన వడ్లు ఎన్నడు ఆరాలె. ఎప్పుడు అమ్ముకోవాలె. అటు సర్కారు, ఇటు ప్రకృతి రైతుకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చినయి.

-వేల్పుల మల్లేశ్వరి, మహిళా రైతు (చందపల్లి)